క్లుప్తంగా

నేటి నుంచి టీకాలు

మిడ్జిల్: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈనెల 15 నుంచి మూగ జీవాలకు గాలి కుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి శివరాజ్ తెలిపారు. మూడు బృందాలు మండలంలో పర్యటిస్తాయని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థినికి సన్మానం

చిన్నచింతకుంట: మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని అమరశ్రీ అభిజ్ఞాన్ నీట్‌లో స్టేట్ ర్యాంక్ సాధించిన నేపథ్యంలో సోమవారం వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు. అమరశ్రీ తల్లిదండ్రులు నాగరాజు, కల్యాణితో పాటు పలువురు ఉన్నారు.

నాగినోనిపల్లిలో ఐకేపీ కేంద్రం ప్రారంభం

హన్వాడ: నాగినోనిపల్లిలో సోమవారం వరి ధాన్యం సేకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో రైతులు తమ ధాన్యాన్ని కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించాలని ఏపీఎం సుదర్శన్ పేర్కొన్నారు. దళారులను నమ్మిమోసపోవద్దని పేర్కొన్నారు. సేకరణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగాలు సాధించిన వారికి సత్కారం

అడ్డాకుల: మండల కేంద్రంలోని అసెంబ్లీ కాలనీకి చెందిన వాకిటి ఆంజనేయులు స్కూల్ అసిస్టెంట్(స్పెషల్ ఎడ్యుకేషన్), బోయ మహేష్ ఎస్టీటీ(స్పెషల్ ఎడ్యుకేషన్)గా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారు. దీంతో సోమవారం నాయకులు, యువకులు వారిని శాలువాలతో సత్కరించి అభినందించారు. వారిద్దరిని ఆదర్శంగా తీసుకుని యువకులు ఉద్యోగాలు సాధించే దిశగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గంగుల శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మహేందర్, శ్రీనివాస్ యాదవ్, మహేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

నారాయణపేట రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న 39వ జాతీయస్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా నుంచి బసంత్ ఎంపికై నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రమణ తెలిపారు. ఈ సందర్భంగా బసంత్‌కు అభినందనలు తెలియజేశారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రజావాణిపై అవగాహన కల్పించండి

కలెక్టర్ విజయేందిర



ప్రజావాణిలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

జడ్చర్ల టౌన్: మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని.. ప్రతి అధికారి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ విజయేందిర ఆదేశించారు. ప్రజావాణి పురస్కరించుకుని జడ్చర్ల మండల పరిషత్ సమావేశ మందిరాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ప్రతి వారం ప్రతిశాఖకు సంబంధించిన అధికారి హాజరు కావాలన్నారు. ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు క్లియరెన్స్ చేసి నివేదికను పంపించాలన్నారు. ముఖ్యంగా ప్రజావాణి మండలస్థాయిలోనే దరఖాస్తులు స్వీకరిస్తున్న విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సోమవారం విధిగా ప్రజావాణిలో పాల్గొనాలని ఇతర కార్యక్రమాలు పెట్టుకోరాదన్నారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికపుడు పరిశీలించి పరిష్కరించాలని జాప్యం చేయరాదని ఆదేశించారు. మండలం, మున్సిపాలిటీల్లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వెంటనే క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీలో కమిషనర్, టీపీఓ, ఇరిగేషన్ ఏఈ, గ్రామాల్లో ఆర్‌ఐ, కార్యదర్శి, ఇరిగేషన్ ఏఈలు దరఖాస్తులను పరిశీలించి స్థలాన్ని పరిశీలించి క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని.. మున్సిపల్ కమిషనర్ రాజయ్య, ఎంపీడీఓ విజయ్‌కుమార్‌లను ఆదేశించారు. కులగణనకు సిద్ధం కావాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. నీటిసమస్యలు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలన్నారు.

మూడు ఫిర్యాదులు

మిడ్జిల్: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణికి సోమవారం మూడు ఫిర్యాదులు వచ్చిన్నట్లు ఎంపీడీఓ గీతాంజలి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నవాబుపేటలో 13 దరఖాస్తులు

నవాబుపేట: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 13 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. వాటిలో మూడు దరఖాస్తులు అక్కడే పరిష్కరించగా పది మాత్రం పరిశీలనలో ఉన్నట్లు వివరించారు.

ముడా ఛైర్మన్‌ను కలిసిన కమిషనర్


ముడా ఛైర్మన్ లక్ష్మణ్‌యాదవ్‌కు పూలబొకె అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొత్తగా ముడా ఛైర్మన్‌గా నియమితులైన కె.లక్ష్మణ్‌యాదవ్‌ను సోమవారం ఆయన నివాసంలో మున్సిపల్ కమిషనర్, ముడా వైస్ ఛైర్మన్ అయిన డి.మహేశ్వర్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూలబొకె అందజేసి అభినందనలు తెలియజేశారు.

సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్ : ముడా ఛైర్మన్‌గా నియామకమైన లక్ష్మణ్‌యాదవ్‌ను సోమవారం యువజన కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌లో ఘనంగా సన్మానించారు. మహ్మద్ ఇద్రీస్, ఎండి. నవీద్, మహ్మద్ నదీం, ముజీబ్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో కాయిన్‌మేళా


నాణేలు పంపిణీ చేస్తున్న బ్యాంక్ అధికారులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం మెట్టుగడ్డలోని యూనియన్ బ్యాంక్ శాఖలో సోమవారం రూ.10ల నాణేల మేళా నిర్వహించి పంపిణీ చేశారు. మేళాలో బ్యాంక్ రీజినల్ హెడ్ ఆర్.సత్యనారాయణ, డిప్యూటీ రీజినల్ హెడ్ శ్రీనివాస్ మూర్తి పాల్గొన్నారు. రూ.10 నాణేలు చట్టబద్ధమైనవని, వీటిని రోజువారీ లావాదేవీలకు ఉపయోగించవచ్చని ఆర్‌బీఐ అధికారులు స్పష్టం చేసినట్లు తెలిపారు. రూ.10నాణేలు అవసరమైనవారు మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ శాఖలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ అమిత్‌సాహు పాల్గొన్నారు.

మానవజాతి మనుగడకు కృషి


నవాబుపేటలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల విన్యాసాలు

భూత్పూర్ : ఆధునిక కాలంలో మానవజాతి మనుగడ కోసం ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తుందని పాలమూరు విభాగ్ ధర్మ జాగరణ ప్రముఖ్ మాలే శ్రీకాంత్ అన్నారు. సోమవారం సాయంత్రం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ బుద్దాపుర్ ప్రఖండ్ (భూత్పూర్) వారి ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాలు, ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడి వంద సంవత్సరాల్లో అడుగీడుతున్న సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు భూత్పూర్ పట్టణంలోని న్యూఎర ఉన్నత పాఠశాల నుంచి పట్టణంలోని వీధుల గుండా పథ సంచలన్ నిర్వహించారు. శ్రీ సరస్వతి విద్యాపీఠం పాలమూరు జిల్లా అధ్యక్షుడు మోదేపల్లి కొండయ్య, రేకులపాటి రాము పాల్గొన్నారు.


భూత్పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కరసేవకులు

ప్రపంచం చూపు దేశం వైపు

నవాబుపేట: దేశం మొత్తం పరాయి పాలనలో ఉన్న తరుణంలో హిందూ సంస్కృతి, సంప్రదాయాలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో డాక్టర్‌జీ ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించారని తెలంగాణ ప్రాంత సేవా ప్రముఖ్ శివశంకర్ వివరించారు. సోమవారం శరత్ కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచం మొత్తం భారత దేశం వైపు చూస్తుందని అందుకే మనం మరింతగా కర్తవ్యం నేరవేరుస్తూ సంఘాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు పథసంచలన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కర సేవకుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

ఎస్సెస్సీ పరీక్ష సమయం పెంచాలని వినతి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్సెస్సీ పరీక్షలో బయాలజీ, ఫిజికల్ సైన్స్‌కు సబ్జెక్టులకు సంబంధించి పరీక్ష రాసే విద్యార్థులకు 20 నిమిషాలు అదనపు సమయాన్ని కేటాయించాలని.. టీపీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు భూపతిసింగ్, జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబులు హైదరాబాద్‌లో విద్యాశాఖ సెక్రటరీ నర్సింహారెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అలయ్ బలయ్




జడ్చర్ల టౌన్: విజయదశమి పురస్కరించుకుని సోమవారం సాయంత్రం పట్టణంలోని చంద్రగార్డెన్‌లో తొలిసారిగా రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ ఛైర్మన్ బి.శివకుమార్ అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పట్టణంలోని ఆయా సంస్థల ప్రముఖులు 63 మంది హాజరయ్యారు. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి శివకుమార్ మాట్లాడారు. తొలిసారిగా చేసిన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరు కావటం సంతోషంగా ఉందన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



నారాయణపేట రూరల్: దసరా పండుగను పురస్కరించుకొని నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు సోమవారం కౌన్సిలర్ మహేష్ ఆధ్వర్యంలో బహుమతుల ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ.12,222, రెండవ బహుమతి రూ.6,666 నగదును అందజేశారు. కర్రెమ్మ, మైసమ్మ గుడుల దగ్గర బతుకమ్మ ఆడినవారికి, బతుకమ్మను రంగురంగుల పువ్వులతో అలంకరించి ప్రతిభ కనబర్చిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. మహిళలకు డ్యాన్స్ ప్రోగ్రామ్ నిర్వహించి బహుమతులు అందజేశారు. అదేవిధంగా వార్డుకు చెందిన ప్రతి మహిళకు రెండు రవికలు, గాజులు, తమలపాకు, అరటిపండు, వక్కలు పంపిణీ చేశారు.

నేటి నుంచి మహిబూబ్ సుహాని ఉత్సవాలు



మద్దూరు: మండలంలోని మద్దూరు, దమగ్నాపూర్‌లో వెలిసిన మహిబూబ్‌సుహాని ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రాత్రి భారీ ఊరేగింపుతో గంధోత్సవం, మంగళవారం కందూరు, భక్తుల మొక్కులు, బుధవారం జాతర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ప్రశాంత్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు కళాశాలలకు వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు భరత్, నందు, ఈశ్వర్, రాము, ప్రవీణ్, శివ, సాయి తదితరులు పాల్గొన్నారు.

వరికి కంకినల్లి బెడద

మహమ్మదాబాద్: వరి పంటలను కంకినల్లి ఆశించి పంటలు నష్టపోయే ప్రమాదం పొంచి ఉందని మండల వ్యవసాయాధికారి నరేందర్ సూచించారు. సోమవారం ఆయన మండలంలోని నంచర్ల, దేశాయిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో సాగవుతున్న వరి పంటలను ఆయన పరిశీలించారు. వరి పంటలను కంకినల్లి ఆశించిందని తెలిపారు. దీనివల్ల పంట పూర్తిగా దెబ్బతిని దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. కంకినల్లి ఆశించిన గింజలపై నల్లటి మచ్చలు ఏర్పడి గింజకు పాలుపోసుకోక, తాలుగింజలుగా మారేవీలుందన్నారు. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే 15రోజుల వ్యవధిలో రెండుసార్లు ప్రొఫెనోఫాస్ 2మిల్లీలీటర్లు లేదా డైకోఫాల్ 5మిల్లీలీటర్లు, స్పైరోమెసిఫిన్ 1మిల్లీలీటరు, ఈమూడింటిలో ఏదైనా మందును ఒక్క లీటరు నీటిలో కలిసి పొలానికి పిచికారీ చేయాలని వివరించారు. రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఊరేగింపు


ఊరేగింపులో కోలాటాలు వేస్తున్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం లక్ష్మీనగర్‌కాలనీలో శ్రీమాత రాజరాజేశ్వరి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. సోమవారం అమ్మవారి ఊరేగింపును భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఊరేగింపు ఎదుట కోలాట ప్రదర్శనలు, భజనలు చేశారు. అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..


బతుకమ్మల చెంత మహిళల ఆటపాటలు


బతుకమ్మతో చిన్నారి

నవాబుపేట: బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ మండలకేంద్రంలో మహిళలు ఆడిపాడారు. బతుకమ్మల చుట్టూ చేరి బొడ్డెమ్మ వేస్తూ సోమవారం ఆనందంగా గడిపారు. అంతకుముందు బతుకమ్మలను అందంగా అలంకరించి తీసుకువచ్చారు. ప్రధాన చౌరస్తాల్లో, శివాలయం, హనుమాన్ దేవాలయం వద్ద బతుకమ్మలను ఉంచి నృత్యాలు, కోలాటం వేశారు. అనంతరం గ్రామ సమీపంలోని పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

విలీన సభను విజయవంతం చేద్దాం


అప్పిరెడ్డిపల్లిలో వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: ఈ నెల 20న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించే విలీన సభ వాల్‌పోస్టర్‌ను సోమవారం మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి బి నరసింహ మాట్లాడుతూ దేశ జనాభాలో 45 కోట్ల కార్మికులకు గాను, కేవలం 6 కోట్ల మంది మాత్రమే సంఘటిత రంగంలో ఉన్నారన్నారు. మిగతా 39 కోట్ల మంది అసంఘటిత కార్మికులు దరిద్రంలో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలు, నరసింహ, కతలప్ప, నాగప్ప, మల్లేష్, లాలు, నగేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పూర్వ ఉపాధ్యాయులతో విద్యార్థులు

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2011–12 పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా బుద్ధులు నేర్పిన పూర్వ ఉపాధ్యాయులను శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ జీహెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు కృష్ణయ్య, రామకృష్ణ, బాల్‌రాజ్, బాలకిష్టప్ప, లక్ష్మన్, మాణిక్యప్ప, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఊట్కూర్ మండలం పగిడిమారికి చెందిన రైతు అశోక్ తన మూడెకరాల పొలంతో పాటు మరో ఆరెకరాలు కౌలుకు తీసుకొని పత్తిసాగు చేశారు. అధిక వర్షాలతో దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చింది. మొత్తం 42 బస్తాల పత్తిని అమ్మేందుకు తిప్రాస్‌పల్లి శివారులోని మిల్లుకు తీసుకెళ్లారు. అయితే పత్తికి కండ లేదంటూ.. కాడి ఉందని ధరను అమాంతం తగ్గించారు. తొలుత రూ. 7వేలు, రెండవ సారి రూ. 7,050, మూడవ సారి రూ. 7,100 ధర కోడ్ చేశారు. ఇదేమిటని అడిగితే, పత్తి కండ లేదంటూ సమాధానం ఇచ్చినట్లు రైతు ఆవేదన వ్యక్తంచేశారు.



ఊట్కూర్ మండలం ఓబ్లాపూర్‌కు చెందిన రైతు రవి 25 బస్తాల పత్తిని అమ్మేందుకు మిల్లుకు తీసుకెళ్లగా.. మొదటగా రూ.6,900 ధర వేశారు. ధర పడదని రైతు అడుక్కోగా మరో రూ. 100 పెంచి రూ. 7వేల ధర నిర్ణయించారు. ఆ తర్వాత మళ్లీ అడగగా రూ. 7,050, రూ. 7,100, రూ. 7,150 ధరలు వేశారు. పత్తిలో తేమ శాతమంటూ ఇలా ఐదుసార్లు ధరలు వేయడాన్ని చూస్తే రైతుల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

తేమ చాటున దోపిడీ


తిప్రాస్‌పల్లి సమీపంలోని విజయ్ కాటన్ మిల్లులో అమ్మకానికి వచ్చిన పత్తి

- పది రోజుల వ్యవధిలో రూ. 500 తగ్గిన రేటు
- ఆందోళనలో రైతులు
- మిల్లులవైపు కన్నెత్తి చూడని అధికారులు

నారాయణపేట: జిల్లాలోని కాటన్ మిల్లుల యజమానులు పత్తి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పత్తిని మిల్లులకు తీసుకెళ్తే ఇష్టానుసారంగా ధరలు వేస్తూ దోచుకుంటున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలో తేమ సాకుతో 10 రోజుల వ్యవధిలోనే క్వింటాల్‌కు సుమారు రూ. 500 ధర తగ్గించారని చెబుతున్నారు. పంట ఉత్పత్తులు చేతికొచ్చే సమయానికి మార్కెట్‌లో ధర క్రమంగా తగ్గిపోతుందని వాపోతున్నారు.

మిల్లర్లు వేసిందే ధరలు..

అంతర్జాతీయ మార్కెట్‌లో వారం రోజులుగా ధరలు తగ్గాయంటూ కాటన్ మిల్లుల యజమానులు ధరలను అమాంతం తగ్గించేస్తున్నారు. మిల్లుల యజమానులు కుమ్మక్కై ధరలు తగ్గిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

జిల్లాలో మార్కెట్ అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారని.. ధరల్లో వ్యత్యాసాలపై దృష్టి సారించి, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు మండిపడుతున్నారు. ధరలు తగ్గిస్తున్నారని అధికారులకు చెబుతున్నా పట్టించుకున్న పాపాన పోవడం లేదని వాపోతున్నారు. మక్తల్, నారాయణపేట వ్యవసాయ మార్కెట్ల పరిధిలోని కాటన్ మిల్లులను రోజు సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తేనే రైతులకు గిట్టుబాటు ధరలు వస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సీసీఐపైనే ఆశలు..

వానాకాలంలో జిల్లావ్యాప్తంగా రైతులు 1,65,150 ఎకరాల్లో పత్తిని సాగుచేశారు. జూన్‌లో వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం.. జూలైలో మోస్తరు వర్షం కురవడం.. ఆగస్టులో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో పత్తిపంట బాగా దెబ్బతింది. పంట దిగుబడి అంతంతమాత్రంగా ఉంది. ఈ నేపథ్యంలో బయటి మార్కెట్‌లో పత్తికి ధరలు తక్కువగా ఉండటం.. సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేటు వ్యాపారులు కుమ్మక్కై తేమ చాటున అమాంతం ధరలను తగ్గిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభిస్తే, క్వింటాల్‌కు మద్దతు ధర రూ. 7,521 వస్తుందని ఆశిస్తున్నారు.

తేమశాతం మేరకు ధరలు (రూ.లలో) ఇలా..

తేమశాతం	ధర
21-22	6,500
18-20	6,800
15-17	7,000
14-16	7,200
12-13	7,350
08-09	7,450

ఇటీవల విజయ్ కాటన్ మిల్లులో క్వింటాల్ పత్తికి వచ్చిన ధరలు (రూ.లలో)..

తేదీ	కనిష్టం	గరిష్టం
03	6,500	7,800
07	6,500	7,450
10	5,000	7,300
11	5,000	7,300


ప్రభుత్వం కొనాలి..



ప్రైవేటులో మిల్లులకు పత్తిని తీసుకెళ్తే ఆశించిన ధరలు రావడం లేదు. పచ్చిగుందంటూ రూ. 5 వేల నుంచి రూ. 6,500 ధర మాత్రమే వేస్తున్నారు. ఈసారి వర్షాలతో దిగుబడి అంతంతమాత్రంగా ఉండగా.. కాటన్ మిల్లులో ధరల దెబ్బను తట్టుకోలేకపోతున్నాం. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసి, పత్తి రైతులను ఆదుకోవాలి.

– షాజిక్, రైతు, ఎర్గట్‌పల్లి

దోచుకుంటున్నారు..



రైతులు మిల్లుకు పత్తిని తీసుకెళ్తే చాలు తేమ ఉందంటూ, ఇష్టమొచ్చిన ధరలు వేస్తున్నారు. రైతులను దోపిడీకి గురిచేస్తున్నారు. దూరం నుంచి వచ్చే రైతులు పత్తిని తిరిగి తీసుకెళ్లి, ఆరబెట్టుకొని తీసుకువచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, రైతు, బిజ్వార్